ప్రజాశక్తి
శనివారం 21 జనవరి 2023
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





ప్రజాభీష్టం మేరకు నిర్ణయాలు చేయాలి

- ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం వెల్లడి



పబ్లిక్ హియరింగ్‌లో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు (స్క్రీన్‌పై)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ప్రజల అభీష్టానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఎపిఇఆర్‌సి ఆధ్వర్యంలో రెండు రోజులుగా గురుద్వార్ సమీపంలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో శుక్రవారం ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు వర్చువల్ ద్వారా పాల్గొన్నారు. ముఖ్యమైన సూచనలు, ప్రతిపాదనలు, అభిప్రాయాలను కమిషన్ ముందు ఉంచారు. అత్యంత ప్రాధాన్యతగల ప్రజాభిప్రాయ సేకరణను కేవలం వర్చువల్‌గా నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అత్యధిక మంది ఇటువంటి కార్యక్రమంలో భాగస్వాములయ్యే విధంగా ప్రత్యక్షంగానూ, వర్చువల్‌గానూ జరపాలని కోరారు. డిస్కంలు తమకు, వెబ్‌సైట్‌లో పెట్టిన నివేదికలపై తాము సమర్పించిన లిఖితపూర్వక అభ్యంతరాలకు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేవన్నారు.

'రాష్ట్రంలో విద్యుత్ రంగం ప్రమాదంలో ఉంది. విద్యుత్ ఒప్పందాలు ఆందోళనకరంగా ఉన్నాయి. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ నుంచి ప్రభుత్వం వైదొలగి ప్రయివేటు చేతుల్లోకి పోతోంది. ప్రభుత్వ గుత్తాధిపత్యం బదులు ప్రయివేటు గుత్తాధిపత్యం పెరగడం రాష్ట్రానికి నష్టం' అని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ వల్ల ప్రభుత్వ విద్యుత్ రంగ సంస్థలకు, ప్రజలకు, రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతమన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల్లో ప్రయివేటు సంస్థలను అనుమతించరాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చట్ట సవరణలను తిరస్కరించాలని సూచించారు. ఎపిఇఆర్‌సి తన పరిధిలోని ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ మూడు డిస్కంలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కావల్సిన ఆదాయం రూ.52590.71 కోట్లుగాను, టారిఫ్ పెంపు రూ.697 కోట్లుగాను, రెవెన్యూ అంతరం రూ.12792.70 కోట్లుగాను ప్రతిపాదించిన విషయాన్ని తెలిపారు. ఈ రెవిన్యూ అంతరాన్ని మిగతా 2లో..


ఆందోళనకు దిగిన అభ్యర్థులు

ఇలాగేనా పోస్టుల భర్తీ..!

స్టాఫ్ నర్సు అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - సీతమ్మధార : వైద్య ఆరోగ్యశాఖ జోన్ 1 పరిధిలో శుక్రవారం నిర్వహించిన స్టాఫ్ నర్స్ పోస్టుల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. ఎస్‌సి అభ్యర్థులకు న్యాయం జరగలేదని పలువురు వాపోయారు. మార్కులు వేయడంలోనూ, జాబితాను పొందు పరచడంలోనూ తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. శుక్రవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగడంతో ద్వారకా పోలీసులు కౌన్సెలింగ్ సెంటర్ వద్ద మోహరించారు. ఆందోళనకారులను పోలీసులు కౌన్సిలింగ్ కేంద్రం లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సెలక్షన్ జాబితాలో ఉన్నవారిని మాత్రమే అనుమతించారు.

వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : నగరంలో ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నగరంలోని డాబాగార్డెన్స్, రుషికొండ, పిఎం పాలెం తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి జి.స్వరూపరాణి నేతృత్వంలో ఈ దాడులు సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లపై కేసును నమోదు చేసినట్లు స్వరూపరాణి మీడియాకు తెలిపారు. ఆయా వాటర్ ప్లాంట్లలో మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టుల ఆధారంగా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాను చనిపోతూ మరొకరికి ప్రాణం పోసింది..!

వార్త మెయిన్‌లో..

బ్రాండిక్స్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

వార్త 5లో..



జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మహంతి

ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో ప్రారంభం

ఆకట్టుకున్న ఉత్పత్తులు

వార్త మెయిన్‌లో..

పెట్టుబడులకు విశాఖ అనుకూలం

జిల్లా కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెట్టుబడులకు విశాఖ నగరం ఎంతో అనుకూలమని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. వైజాగ పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (విసిసిఐ) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని దసపల్లా హోటల్‌లో 'భవిష్యత్తులో వైజాగ్ వృద్ధి - అవకాశాలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎప్పటికప్పుడు నూతన ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. ఆనందపురం మండలంలో 155 ఎకరాల్లో రానున్న 5, 6 నెలలో నూతన ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. రెండు పోర్టులు కలిగిన ఈ నగరం ఎగుమతులకు ఎంతో అనుకూలమన్నారు. మార్చి 4, 5 తేదీలలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించనున్నామని, అందులో విసిసిఐ భాగస్వామిగా ఉందని అన్నారు. మార్చి 28, 29, 30 తేదీల్లో దేశంలోనే అతి పెద్ద జి-20 సమ్మిట్ జరుగనుందని, మిగతా 2లో..

నాలుగైదు నెలల్లో పరిపాలనా రాజధాని

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రానున్న 4, 5 నెలల్లో విశాఖపట్నం పరిపాలనా రాజధాని కానుందని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ విశాఖ రాజధాని గురించి పలు అంశాలను ప్రస్తావించారు. పరిపాలనా రాజధాని దిశగా ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రాజధానిగా విశాఖ ఆవిర్భవిస్తే నగరానికి మరిన్ని నూతన పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయన్నారు. మెట్రో రైలు కూడా త్వరలోనే విశాఖకు రానుందని, తాజాగా దీనిపై చర్చలు జరిగాయని, నెల రోజుల్లో మెట్రో పనులపై ప్రకటన రాబోతోందని అన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ప్రజాభీష్టం మేరకు నిర్ణయాలు చేయాలి

ఏ విధంగా పూడుస్తారన్నది డిస్కాంలు స్పష్టం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ప్రజలపై ఎటువంటి భారాలూ వెయ్యరాదని ఇఆర్‌సికి సూచించారు.

అన్నదాత నేడు తీవ్ర సంక్షోభంలో ఉన్నాడని, ఇటువంటి తరుణంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపునకు ప్రతిపాదించడం మరింత సంక్షోభంలోకి నెట్టడమే అవుతుందని అన్నారు. మీటర్ల బిగుంపును తక్షణమే విరమించుకోవాలని కోరారు. నివాస గృహాలకు, వ్యాపార సంస్థలకు, వినియోగదారులందరికీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదన చేశారని, ఇది ప్రజల మీద మరింత భారాలు వేసేదిగా ఉందని పేర్కొన్నారు. ఈ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. కరోనా విపత్తు, విద్యుత్ కోతల సమయంలో చిన్న తరహా పరిశ్రమలకు ఎమ్‌డి ఛార్జీలు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకూ అమలు చేయలేదని తెలిపారు. కరోనా విపత్తు వల్ల అత్యధికం సంక్షోభంలో పడ్డాయని, కొన్ని మూతబడ్డాయని తెలిపారు. వీటికి విద్యుత్ రాయితీలు తిరిగి ఇవ్వాలన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వీటిని సంక్షోభం నుంచి బయటపడేయాలని కోరారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టి తరగతుల ప్రజలకు ఉచిత విద్యుత్తును ఇప్పటికే కొన్ని చోట్ల నిలిపివేశారని, తక్షణమే పునరుద్ధరించాలని విన్నవించారు. నివాసంతో నిమిత్తం లేకుండా ప్రతి ఎస్‌సి, ఎస్‌టి కుటుంబానికి ఉచిత విద్యుత్ రాయితీ వర్తింపజేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల నుంచి అదనపు లోడు, కన్స్యూమర్ డిపాజిట్స్, పెనాల్టీలు, ట్రూ అప్ ఛార్జీలు విచక్షణా రహితంగా వసూలు చేస్తున్నారని, ఇవి ప్రజలకు మోయలేని భారంగా ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌ను లాభనష్టాలతో చూడరాదన్నారు. విద్యుత్ ప్రమాదాలు, మరణాలు విశాఖలో పెరిగాయని, నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదాలకు బలవుతున్నారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయిల నష్టపరిహారం, మృతుని కుటుంబ సభ్యునికి పర్మినెంట్ ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వం జిఒ జారీ చేయాలని కోరారు. వినియోగదారుని ఆధార్ కార్డు ఆధారంగా నూతన విద్యుత్ కనక్షన్ మంజూరు చేసే పద్ధతిని నిలుపుదల చేశారని, ఇంటి పట్టాలు, ఆస్తి పన్నులు, ఇతర డాక్యుమెంట్లు లేవనే పేరుతో నూతన కనక్షన్లు మంజూరు చేయడం లేదని తెలిపారు. దీనివల్ల జిల్లాలో వందలాది మంది విద్యుత్ సౌకర్యానికి నోచుకోవడం లేదన్నారు. .కనుక పాత పద్ధతినే పునరుద్ధరించాలని ప్రతిపాదన చేశారు.

పెట్టుబడులకు విశాఖ అనుకూలం

అందులో కూడా విసిసిఐ భాగస్వామిగా ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలనా రాజధాని కానుందని, దానికి సంబంధించిన కార్యకలాపాలను ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో ముంబయి తర్వాత ఆర్థిక రాజధానిగా ఎదిగే అవకాశం విశాఖకే ఉందని ఆయన అన్నారు. వచ్చే నెల రోజుల్లో భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరగనుందని, నేషనల్ హైవే -16ను ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేయనున్నామని, తద్వారా నగరంలో రవాణా వ్యవస్థ సులభతరం అవుతుందని తెలిపారు. సుమారు 15 వేల కోట్ల వ్యయంతో నూతన డేటా సెంటర్‌కు రానున్న 5, 6 నెలల్లో శంకుస్థాపన జరగనుందని, తద్వారా సుమారు 7 వేలు ఉద్యోగాలకు అవకాశం ఉందని తెలిపారు. అనకాపల్లి - అనందపురం హైవే రోడ్డును 5, 6 నెలల్లో ప్రారంభిస్తామని, రూ.131 కోట్లతో జిల్లా వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేయనున్నామని, నగరంలో 12 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో విసిసిఐ ప్రస్తుత అధ్యక్షుడు ఆర్.సతీష్, సభ్యులు పిఎల్ఎన్.రాజు, కార్యదర్శి రోలండ్ విలియమ్స్, మాజీ అధ్యక్షులు బివి.రాజు, నూతన సభ్యులు రాజశేఖర్ గిడుతురి, బివిఎస్.ప్రభాకర్, కోశాధికారి సురేంద్ర స్వామి పాల్గొన్నారు.

'దక్షిణం' వైసిపిలో గ్రూపుల గోల

ఎమ్మెల్యే గణేష్ కుమార్‌పై తీవ్ర అసమ్మతి
- ఆయనకు టిక్కెట్ ఇస్తే.. కలిసి పనిచేసేది లేదన్న కొందరు కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం వైసిపిలో గ్రూపుల గోల సద్దుమణగలేదు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు రానున్న ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ ఇవ్వరాదని, ఇస్తే ఆయన విజయానికి తాము పని చేసేది లేదని ఈ నియోజకవర్గంలోని కొందరు కార్పొరేటర్లు కుండబద్దలు కొట్టి మరీ చెబుతున్నారు. కొందరు కార్పొరేటర్లు తమలో ఒకరికి టిక్కెట్ ఇస్తే తాము గెలిపించుకుంటామని అంటున్నారు. గురువారం వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలోనూ ఈ వాదనలు వినిపించాయి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి రెండో పర్యాయం టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో టిడిపి ఓటమి చెంది, వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గణేష్ కుమార్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కుటుంబ సభ్యులతో కలిసి వైసిపిలో చేరారు. పార్టీ మారి వచ్చిన గణేష్ కుమార్‌కు తప్పనిసరిగా 2024 ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఇస్తామని జగన్ హామీ ఇచ్చినట్లు, ఆ హామీతోనే గణేష్ కుమార్ వైసిపి తీర్థం పుచ్చుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే క్షేత్రస్థాయిలో వైసిపి కార్పొరేటర్లు, కొందరు కార్యకర్తలు గణేష్ కుమార్ రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకేసారి ఎనిమిది మంది కార్పొరేటర్లు గణేష్ కుమార్ ఏర్పాటు చేసిన ఒక ముఖ్యమైన సమావేశానికి వెళ్లకుండా, తాము ఎందుకు వెళ్లలేదో తగిన కారణాలతో పార్టీ అధిష్టానానికి ఒక లేఖ పంపారు. ఇది జరిగిన కొన్నాళ్లకు రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి కార్పొరేటర్లను పిలిచి మంతనాలు చేశారు. దీంతో కొందరు మనసు మార్చుకొని గణేష్ కుమార్‌తో కలిసి పని చేస్తున్నారు.

మళ్లీ మొదటికి..

వైవి.సుబ్బారెడ్డి సమక్షంలో గురువారం జరిగిన సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, కార్యకర్తలు గణేష్ కుమార్‌ను వ్యతిరేకిస్తూ మళ్లీ మాట్లాడారు. గణేష్ కుమార్ మద్దతుదారులు కూడా అదే స్థాయిలో ఎదురు దాడి చేశారు. దీంతో సుబ్బారెడ్డి స్పందిస్తూ 'ఈ పంచాయతీ ఇక్కడ కాదు, వ్యక్తిగతంగా ఒక్కొక్కరితో నేను మాట్లాడుతాను' అని చెప్పడం, అదేవిధంగా వారితో మాట్లాడటం జరిగింది. ఎక్కువ మంది గణేష్ కుమార్‌ను వ్యతిరేకిస్తూ ఆయనకు చెప్పినట్టు తెలిసింది. జివిఎంసి 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ తొలి నుంచీ గణేష్ కుమార్‌ను తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. గణేష్ కుమార్ వైసిపిలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకూ ఆయనతో కలిసి ఏ ఒక్క కార్యక్రమంలోనూ సాధిక్ పాల్గోలేదు. 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వార్డులోకి వచ్చిన ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను ప్రజల సమక్షంలోనే వ్యతిరేకించారు. ఆయన బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సీతంరాజు సుధాకర్ ముఖ్య అనుచరుడు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాలని గట్టిగా భావిస్తున్నారు. తన వార్డుతోపాటు దక్షిణ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను నాగరాజు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆర్థికంగా అందుకోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు. ఇదే విషయాన్ని సుబ్బారెడ్డితో జరిగిన సమావేశంలో ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పార్టీ టికెట్ తనకు ఇవ్వని పక్షంలో తనకు జనసేన పార్టీ నుంచి ఆహ్వానం ఉందని కూడా తన అనుచరుల ద్వారా సుబ్బారెడ్డి వద్ద చెప్పించినట్లు తెలిసింది. మరోవైపు జనసేన ముఖ్య నాయకులతో నాగరాజు ఈసరికే మంతనాలు చేసినట్లు వినికిడి. ఆయన ఇండిపెండెంట్ కార్పొరేటర్‌గా గెలుపొంది ఆ తర్వాత వైసిపిలో చేరారు. వైశ్య సామాజిక తరగతి చెందిన గ్రంధి మాధవి 1983లో ఇదే నియోజకవర్గం (విశాఖ - 1) నుంచి టిడిపి తరపున గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో వైశ్య సామాజిక తరగతి వారు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నందున ఈసారి తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ కోరుతున్నారు. విశాఖ-1 నియోజవర్గంగా ఉన్నప్పుడు 1972లో ఎంఆర్.డీన్, 1994లో ఎస్ఎ.రెహమాన్ ముస్లిం సామాజిక తరగతికి చెందినవారు గెలుపొందారు. అదే సామాజిక తరగతికి చెందిన మహమ్మద్ సాధిక్ ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఈసారి ఆశిస్తున్నారు. ఆయన కూడా ఇండిపెండెంట్ కార్పొరేటర్‌గా గెలుపొంది, ఆ తర్వాత వైసిపిలో చేరారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం తనకు ఇవ్వాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కోరుతున్నారు. ఆయన కూడా ఇండిపెండెంట్‌గా గెలుపొంది ఆ తర్వాత వైసిపిలో చేరారు. కందుల నాగరాజు, మహమ్మద్ సాధిక్, విల్లూరి భాస్కరరావు ఈ ముగ్గురు వైసిపికి చెందిన వారే. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో టిక్కెట్లు దక్కని కారణంగా వీరు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు. తిరిగి సొంత గూటికి చేరారు.

సుధాకర్ సంగతేంటి ?

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సుధాకర్ ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించి అనేక కార్యక్రమాలను గత రెండేళ్లలో నిర్వహిస్తూ వచ్చారు. అయితే ఆయన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజవర్గం నుంచి శాసన మండలికి పోటీ చేయాలని పార్టీ నిర్ణయించింది. దీంతో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల్లో ఏ కారణం చేతనైనా ఆయన ఓటమి చెందితే మరోసారి దక్షిణ ఎమ్మెల్యే సీటుపై పోరాటం చేసే వీలుంది.

2019 ఎన్నికల్లో ఈ నియోజకవర్గ నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందిన ద్రోణంరాజు శ్రీనివాసరావు రెండేళ్ల క్రితం కరోనా కారణంగా కన్నుమూశారు. దీంతో ఆయన కుమారుడు శ్రీ వాత్సవ్ తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఇటీవల తన కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ఇదిలా ఉండగా ఇదే నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ కూడా ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్నారు. ఆయనకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఇంతమంది ఆశావాహుల మధ్య గణేష్ కుమార్‌కు ఎమ్మెల్యే టికెట్ వస్తుందా..? రాదా ...? వస్తే ఆయన విజయానికి వీరంతా పనిచేస్తారా, లేదా అనేది తెలియాల్సి ఉంది.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ పని చేస్తున్నాయని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న ఎపి ఎన్‌జిఒ భవన్‌లో 2023కు సంబంధించి ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్‌తో కలసి శ్రీనుబాబు మీడియాతో మాట్లాడారు.

విదేశీ వర్సిటీల ప్రవేశంపై నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి అనుమతిస్తున్న యుజిసి ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కృష్ణా ప్రభుత్వ కళాశాల వద్ద పిడిఎస్ఒ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఎల్. భాను మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశంలోకి విదేశీ విశ్వవిద్యాలయాలు, విదేశీ ఉన్నత విద్యా సంస్థల ప్రవేశానికి అనుమతిస్తున్నట్లు అధికారులు ప్రకటించడం దారుణమన్నారు. విదేశీ విద్యాసంస్థలు వ్యాపార ప్రయోజనాలే ఆశిస్తాయన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి -ఆనందపురం : గడచిన మూడేళ్లలో అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఎటువంటి పనులు పూర్తికాలేదని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున వివిధ శాఖల అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ స్థాయి అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలు, శాఖల వారీగా చేపట్టిన పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో 83 వివిధ అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా జగనన్న కాలనీలు, గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు ఇతర మౌలిక వసతులపై సంబంధిత శాఖాధికారులతో మాట్లాడారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సమాధానం చెప్పలేక పోతున్నాం : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమంలో గ్రామాలకు వెళుతుంటే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు నిలదీస్తున్నారని, ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని కలెక్టర్ ముందు వాపోయారు. ఈ సందర్భంగా ఆనందపురం నూతన బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్యను కలెక్టర్ దృష్టికి తేగా,తక్షణ చర్యలకు నేషనల్ హైవే అధికారులకు ఆదేశించారు. తగరపువలసలో ఆర్‌టిసి కాంప్లెక్స్, భీమిలిలో అధునాతన సౌకర్యాలతో శ్మశానం, పర్యాటకులను ఆకర్షించేలా బీచ్‌ను తీర్చిదిద్దడం, పద్మనాభం జూనియర్ కాలేజీ ఏర్పాటు, ఆనందపురం కాలేజీకి భవనాలు, తదితర సమస్యలు చర్చకు రాగా, వాటి పరిష్కారానికి వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కనే ఎమ్మెల్యే ముత్తంశెట్టి

వినతుల వెల్లువ

ఆనందపురంలో నిరుపయోగంగా ఉన్న కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవడం, గ్రామంలోని ఇళ్ల స్థలాలలో గ్రామకంఠం బదులుగా దేవాదాయశాఖ భూములుగా చూపించడాన్ని సరిచేయాలని ఆనందపురం సర్పంచ్ సందక లక్ష్మి, మండల యూత్ ప్రెసిడెంట్ చందక అప్పలస్వామి, దంతల వెంకటనారాయణ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ఏనుగుకొండలో ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని బాక్రిపాలెం సర్పంచ్ దావల్ నాగేశ్వరరావు, గ్రామస్తులు మొరపెట్టుకున్నారు.

లొడగలపాలెం ఎస్‌సి కాలనీలో ఇళ్ల స్థలాలను ఎస్‌సిలు కాకుండా వేరొకరు ఆక్రమిస్తున్నారని సియాద్రి రాంబాబు వినతిపత్రం అందజేశారు. తర్లువాడ గ్రామసమీపాన కొండలో క్వారీకి అనుమతులివ్వొద్దని సర్పంచ్ బిఆర్‌బి నాయుడు కోరారు. బిపి.కల్లాలు పేరుతో సచివాలయం లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని సచివాలయ కన్వీనర్ కోన శ్రీను కలెక్టర్ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ పి.రాజబాబు ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, మూడు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జెడ్‌పిటిసిలు కోరాడ వెంకటరావు వెంకటప్పడు, గిరిబాబు, పార్టీ ప్రెసిడెంట్ బంగ సత్యనారాయణ వర్కింగ్ ప్రెసిడెంట్ రావు, ఎంపిపిలు, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు

అంచనా వ్యయం పెంచాలని వినతి

తగరపువలస: ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ అంచనా వ్యయాన్ని పెంచాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ వినతిపత్రం అందజేశారు. ఆనందపురం వచ్చిన కలెక్టర్‌కు పలు సమస్యలపై విన్నవించారు. నాడు, నేడు పథకం ప్రారంభ దశలో అప్పటి మార్కెట్‌లోని సిమెంట్, ఐరన్, పిక్క, ఇసుక, ఇతర భవన నిర్మాణసామగ్రి ధరలకు అనుగుణంగా అంచనాలు వేసి నాడు నేడు నిధులతో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్, పాల కేంద్రాల భవనాలు నిర్మించినట్లు తెలిపారు. అయితే నాటి ధరలకు, నేడు పెరిగిన ధరలకు చాలా వ్యత్యాసం ఉన్నందున, ప్రస్తుత ధరలకు అనుగుణంగా కొత్త అంచనా రూపొందించి బిల్లులు చెల్లించాలని కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ వెంకటనారాయణ

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ, కౌన్సిల్ ప్రతినిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన సంవత్సర కేలండర్‌ను కౌన్సిల్ ప్రతినిధులతో కలిసి స్థానిక సిఐ కె లక్ష్మణమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు ఎం సూర్య శ్రీనివాస్, కాళ్ల సన్నీ, పిట్టా సురేష్ పాల్గొన్నారు.

పిఎం శ్రీ అమలు తీరు పరిశీలన



క్షేత్రస్థాయి పరిశీలనలో పిఎం శ్రీ డీడీ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పిఎం శ్రీ పథకం కింద అర్హత పొందిన వారి వివరాల పరిశీలనకు ఆ పథకం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా డిప్యూటీడైరెక్టర్ వెంకటలక్ష్మి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. స్థానిక జివిఎంసి, పిఎన్‌ఎం ఉన్నత పాఠశాలలో సంబంధిత రికార్డులను పరిశీలించారు. పాఠశాలలోని గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ నిర్వహణ, ట్యాబ్, స్మార్ట్ ల్యాబ్ వినియోగంపై విద్యార్థులను, హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎండిఎం కోఆర్డినేటర్ శాస్త్రి, ఎంఇఒ బాలామణి, హెచ్‌ఎం తిరుమల శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం: చంద్రంపాలెం జెడ్‌పి ఉన్నతపాఠశాలలో సమ్మిట్-1లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పాఠశాలలో పదో తరగతిలో పది సెక్షన్లలో తెలుగుమీడియంలో 210, ఇంగ్లీష్ మీడియంలో 653 మంది మొత్తం 863 మంది విద్యార్థులకు సమ్మిట్ పరీక్షలు నిర్వహించారు. ఒక్కో సెక్షన్‌లో ప్రతిభ చూపిన ఒక్కొక్కరు చొప్పున పది మందికి ఈ ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాలలోనే 555 మార్కులతో కె.మనోజ్ఞను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డిఇఒ చంద్రకళ, డిప్యూటీ డిఇఒ గౌరి శంకర్, సమగ్ర శిక్షణ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు ఎం.రాజబాబు, ఎ.జయ ప్రద, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్

దివీస్ వితరణ



గేటును ప్రారంభిస్తున్న సర్పంచ్, దివీస్ ప్రతినధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తూడెం జెడ్‌పి హైస్కూల్‌కు దివీస్ సిఎస్‌ఆర్ నిధులు రూ.మూడులక్షలతో అమర్చిన రెండు ప్రధాన ఇనుప గేట్లను సర్పంచ్ నరసయ్యమ్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సిఎస్‌ఆర్ ప్రతినిధి నాగరాజు, హెచ్ ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం

ప్రజాశక్తి ములగాడ: స్థానిక సమస్యల పరిష్కారం, వనరుల సద్వినియోగం, పాలనలో ప్రజల భాగస్వామ్యం ద్వారా ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో అవసరమని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పంచాయితీ రాజ్ వ్యవస్థ- తీరుతెన్నులు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ- పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ కల్పించడం ఒక గొప్ప రాజకీయ విప్లవమన్నారు. గ్రామాభివృద్ధిలో యువత, మహిళలు స్వయంసహాయక సంఘాలు భాగస్వామ్యం కావాలన్నారు సదస్సుకు అధ్యక్షత వహించిన రాజనీతిశాస్త్రం సీనియర్ అధ్యాపకురాలు వై. అనసూయదేవి మాట్లాడుత, బలవంతరాయ్ మెహతా కమిటీ నివేదిక ప్రకారం పంచాయతీరాజ్ వ్యవస్థ మొదటిగా రాజస్థాన్‌లో ఏర్పడిందని, అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో అమల్లోకి వచ్చిందని అన్నారు. రోడ్ల, డ్రైనేజీలు, తాగునీటి వసతి, వీధిదీపాల కల్పన పంచాయతీరాజ్ వ్యవస్థతోనే సాధ్యపడిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

నేరాలు ఘోరాలు

వరాహ నదిలో యువకుడు మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని జల్లూరు వరాహనది నదిలో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. తాతయ్య శివరామ శర్మ సంవత్సరీకం కోసమని కాకినాడ నుంచి తల్లిదండ్రులతో కలిసి వచ్చిన నాగ భార్గవ రామశర్మ(16) శుక్రవారం ఉదయం నదిలో స్నానానికి దిగి, వంతెన సమీపంలో గోతిలో మునిగి మృతి చెందాడు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు.



నాగభార్గవ రామశర్మ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని బంగారమ్మపేటకు చెందిన కోడ వెంకటేష్ నక్కపల్లి నుండి బైక్‌పై వెళ్తుండగా, వేంపాడుకు చెందిన కాంట్రకోట సింహాచలం, పెదపూడి లోవరాజు వేంపాడు జంక్షన్ సమీపంలో ఎదురుదురుగా బైక్‌పై వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.

వాలంటీరు వ్యవస్థపై విష ప్రచారం

ప్రజాశక్తి-గాజువాక : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారుని ఇంటివద్దకే నేరుగా వెళ్లి అందిస్తున్న వాలంటీర్ల వ్యవస్థపై విపక్ష నేత చంద్రబాబు, పచ్చమీడియా విమర్శలు చేయడం తగదని స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక టిఎస్ఆర్ కల్యాణమండపంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సిఎం జగన్ ఏ పథకం ప్రవేశపెట్టినా దానిలో లోపాలను ఎత్తిచూపి, ప్రజలన తప్పుదోవ పట్టించడమే వీరి నైజమన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పనులు, పథకాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి నుంచి వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ విముక్తి కల్పించిందని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పనులు, పథకాలు ప్రజలకు అందుతున్నాయంటే వాటిలో వాలంటీర్ల కృషి ఎంతో ఉందన్నారు.

హెర్నియా పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ఆరిలోవ : హెర్నియా సమస్యపై ఎంతమాత్రం నిర్లక్ష్యం తగదని అరిలోవ హెల్త్ సిటీ అపోలో ఆసుపత్రి సీనియర్ లేప్రోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ కిషోర్ విఎంకే గొట్టపు అన్నారు. దీన్ని ముందుగానే గుర్తించి ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్స చేస్తే సమస్య నుంచి సులువుగా బయటపడొచ్చన్నారు హెర్నియా బారిన పడిన రోగులకు కడుపు భాగంలో నొప్పి, బలహీనత, అసౌకర్యంగా వుంటుందన్నారు. గజ్జల్లో వాపు, ముందుకు వంగినప్పుడు, లేదా బరువు ఎత్తినప్పుడు నొప్పి వుంటుందన్నారు. మలవిసర్జనలోనూ ఇబ్బందులుంటాయన్నారు. సమస్యను నిర్ధారించడానికి అబ్డోమిన్‌కు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలన్నారు. ఈ నెల 22న ఆదివారం ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో అబ్డోమిన్ స్కానింగ్‌ను రూ.499కే చేయడంతోపాటు సీనియర్ డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా కల్పిస్తామన్నారు. హెర్నియా బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఔషధ ప్రయోగాలకు ప్రత్యామ్నాయాలపై దృష్టి

ప్రజాశక్తి- మధురవాడ : వివిధ వ్యాధుల నియంత్రణకు కనిపెట్టే ఔషధాలు, వ్యాక్సిన్లకు ప్రస్తుతం జంతువులపై జరుపుతున్న ప్రయోగాల స్థానే ప్రత్యామ్నాయమార్గాలపై పరిశోధకులు దృష్టి సారించారని, త్వరలోనే అవి ఎ అందుబాటులోకి రానున్నాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ పి.రామారావు వెల్లడించారు. గీతం వేదికగా భారత ప్రభుత్వ యానిమల్ వెల్ఫేర్ విభాగం నిర్వహిస్తున్న ప్రాంతీయ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ,. నూతన ఔషధ ఫలితాలను తెలుసుకునేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా 20 మిలియన్ల జంతువులపై ప్రయోగాలు జరుపుతున్నారన్నారు.

పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా!

- నామమాత్రపు కట్టడి చర్యలతో సమస్య పునరావృతం
- అవస్థలు పడుతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు
- శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని వేడుకోలు



చిట్టివలస గణేష్ థియేటర్ దారిలో లీకేజీ నీటితో బురదమయమైన రోడ్డు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చెంతనే గోస్తనీ నది ఉన్నా, అనేక ప్రాంతాల ప్రజలను తాగునీటి సమస్య తరచూ వెంటాడుతూనే ఉంది. దీనికి అనేక సాంకేతిక పరమైన కారణాలున్నాయి. ప్రధానంగా అనేకచోట్ల తాగునీరు లీకేజీలు, వాటి కట్టడికి పకడ్బందీ చర్యలు లేకపోవడం వంటి కారణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అడుగడుగునా పైపులైన్ లీకేజీలు

తగరపువలస, గణేష్ సినిమా థియేటర్ మార్గంలో, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రహరీని ఆనుకుని న్న ప్రాంతంలోనూ, పెట్రోల్ బంక్, జ్యూట్ మిల్లు రోడ్డు, కొండపేటకు వెళ్ళే దారిలో, ప్రధాన రహదారి వద్ద ఇలా చెప్పుకుంటూ పోతే తగరపువలసలో అనేకచోట్ల పైపులైన్లు తరచూ లీకేజీ అవుతున్నాయి. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయి నీటిసరఫరా కాని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వేసవిలో నీటికష్టాలు తీవ్రమయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక లీకేజీ అవుతున్న ప్రాంతాల్లో రోడ్డంతా బురద, గోతులమయమై అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే ముందుందు నీటి కష్టాలు మరింత తీవ్రం

గోస్తనీ పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక తవ్వకాలు మొదలు, క్రమేపీ తగ్గుతున్న నీటినిల్వలు, అడుగంటుతున్న భూగర్భజలాలు వెరశి తాగునీటి కష్టాలు తీవ్రం చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. జనావాసాలు, జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలా ఎక్కడికక్కడే పైపులైన్ల లీకేజీలతో నిరంతా రోడ్డు పాలైతే కొత్త కష్టాలు తప్పవని పలువురు అంటున్నారు. దీనికి తగ్గట్టుగా తాగునీటి సరఫరాకు నిర్దిష్ట ప్రణాళిక అవసరమని పలువురు నిపుణులు అంటున్నారు. ప్రస్తుతానికి పదేపదే వెలుగుచూస్తున్న పైపులైన్ లీకేజీలు, తాగునీటి వృథాను అరికట్టేందుకు నాణ్యమైన పైపులను నిపుణుల పర్యవేక్షణలో అమర్చడం ద్వారా లీకేజీల సమస్యను అధిగమించవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పదేపదే ఒకేమాదిరి సమస్య ఉత్పన్నమౌతున్న నేపథ్యంలో శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కస్తూర్బాలో తనిఖీలు



కస్తూర్బా విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని నేలతేరు కస్తూర్బాగాంధీ పాఠశాలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ముందుగా డిఇఒ చంద్రకళ, ఎపిసి శ్రీనివాసరావు, డిఎం గౌరీశంకర్ మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి పలు విషయాలను ఎంఇఒను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం రాత్రి 10 గంటల సమయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, ఆర్‌జెడి జ్యోతికుమార్, విశాఖ డిఇఒ చంద్రకళ, అనకాపల్లి డిఇఒ లింగేశ్వర్ రెడ్డి కెజిబివి పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు.

26న మెగా రక్తదాన శిబిరం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపి సత్యనారాయణ

ప్రజాశక్తి -ములగాడ : పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధినేత, 60వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పి.వి.సురేష్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం ద్వారా వేరొకరి ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీవీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

31లోగా అపరాధ రుసుముతో 'పది' పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులకు తత్కాల్ ఫీజు చెల్లించేందుకు జనవరి 23 నుంచి 26 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. రూ 500 రుసుముతో జనవరి 23 నుంచి 26 వరకు, రూ.వెయ్యి అపరాధ రుసుముతో జనవరి 27 నుంచి 31 వరకు టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. తత్కాల్ పరీక్ష రుసుము చెల్లింపు గడువు ఎట్టి పరిస్థితిలోనూ పొడిగించబడదని, విద్యార్థులు గమనించి, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కంచరపాలెం.: కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐ (ఓల్డ్)లో ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 45రోజులపాటు శిక్షణ పొందుటకు 21ఏళ్ల వయస్సు కలిగి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులన్నారు. అలాగే ఈనెల 30లోగా హెవీ వెహికల్ ఎల్ఎల్ఆర్ కలిగి, ఏడాది అనుభవం ఉండాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9177967397 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జగనన్న గృహ నిర్మాణ వ్యయం పెంచాలి



సంతకాల సేకరణలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

సిపిఐ ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జగనన్న కాలనీ ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.1.80లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని , టిడ్కో ఇళ్లను అర్హులకు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతంలోని జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులను కలిసి సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైసిపి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో 3,13,832 టిడ్కో ఇళ్ళ నిర్మాణంలో ఉండగా, వాటిలో 8,1040 పూర్తయ్యాయన్నారు.

పూర్తయిన టిడ్కో ఇళ్ల కేటాయింపులో వైసిప తాత్సారం చేస్తోందన్నారు. ఇంటిస్థలాల లబ్ధిదారులకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించాలని కోరారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, వచ్చేనెల 6న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించి, అనంతరం వినతిపత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కె రెహమాన్, సిఎస్ క్షేత్రపాల్, నాయకులు ఎస్.మురళి, ఎ.దేముడమ్మ, కె లక్ష్మణరావు, సిహెచ్ కాసుబాబు, సందీప్, మస్తాన్‌బీ, కె.రమణ, వి.నూకరాజు, సురేష్, సిడిఆర్ రమణ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలి



తగరపువలస జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న దళితులు

ప్రజాశక్తి -తగరపువలస : ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి ఈ నెలాఖరుతో పదేళ్ల కాలపరిమితి పూర్తవుతున్న నేపథ్యంలో దీన్ని శాశ్వత చట్టంగా అమలు చేయాలని దళిత, ఆదివాసీ సంఘాల జెఎసి, కెవిపిఎస్, పలు దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక జంక్షన్‌లో ఆందోళన చేపట్టాయి.

ఈ సందర్భంగా దళిత, ఆదివాసీ సంఘాల జెఎసి కన్వీనర్ పతివాడ రాంబాబు, కెవిపిఎస్ రాష్ట్ర పాధ్యక్షులు భాగం లక్ష్మి మాట్లాడుతూ, దళిత, గిరిజన జనాభా ప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో దళిత సంఘాల ఆందోళన ఫలితంగా ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం రూపకల్పన జరిగిందని, దీని పదేళ్ల కాలపరిమితి జనవరితో ముగుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దీన్ని కొనసాగింపునకు శాశ్వత చట్టం చేయాలని కోరారు. జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. దళిత సంఘాల ప్రతినిధులు కిరణ్, ఈశ్వరరావు, ఎన్ రామారావు, సుబ్బారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మధురవాడలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



సీతమ్మధారలో సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -మధురవాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాల అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 7వ వార్డు కళానగర్‌లో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వచ్చి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక మహిళలు కొన్ని సమస్యలను విన్నవించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకుసూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్‌సి కనకమహాలక్ష్మి, వార్డు అధ్యక్షుడు పోతుల శ్రీనివాసరావు, అల్లాడ లింగేశ్వరరావు, వాండ్రాసి శివకుమార్, రజిని తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 48వ వార్డు బాపూజీనగర్, బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి గడపగడపకూ ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ అధికారం చేపట్టినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుక్షణం ప్రజాశ్రేయస్సుకు పాటు పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఆదరాభిమానాలతో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో యాత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పిల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

22న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వానపల్లి సత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : పద్మశాలి సేవా సంఘం, విశాఖ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 22న ఉదయం 11 గంటలకు నగరంలోని పద్మశాలి భవన్‌లో జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వానపల్లి సత్యనారాయణ (సత్య)తెలిపారు. అఖిల భారత పద్మశాలి సేవా సంఘానికి అనుబంధంగా ఏర్పాటైన తమ సంఘం నూతన కార్యవర్గంలో గౌరవాధ్యక్షునిగా కొప్పల రమేష్, అధ్యక్షులుగా వానపల్లి ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూరిశెట్టి సూరిబాబు, ఉపాధ్యక్షులుగా నీలి రవి, పప్పు శ్రీనివాసరావు, పెంటపల్లి సత్యనారాయణ, కోశాధికారిగా నేమాలి అనేష్ ఎన్నికయ్యారన్నారు. అతిరథ మహారథుల సమక్షంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు.

బ్రాండిక్స్ బాధితులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం, సిఐటియు నాయకులు లోకనాథం, కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి
నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు బ్రాండిక్స్ (సీడ్స్ కంపెనీ) బాధితులకు లక్ష రూపాయల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని, సంఘటనపై సమగ్ర విచారణ చేసి కంపెనీపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్ స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడగా, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 జూన్ 3, ఆగస్టు 2 తేదీల్లో కంపెనీల్లో లీకైన విషవాయువుల ఘటనపై పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా మద్రాసు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటోగా కేసు నమోదు చేసిందని తెలిపారు. కేసును విచారించిన ఎన్జీటీ ఛైర్మన్ ఏకే గోయల్, న్యాయ సభ్యులు సుధీర్ అగర్వాల్, సభ్య నిపుణులు ఎ.సెంథివెల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ఘటనలో 539 మంది బాధితులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఈనెల 18న ఆదేశించిందని పేర్కొన్నారు. బాధితులకు పరిహారంతో పాటు పర్యావరణ పునరుద్ధరణకు రూ.10 కోట్లు జరిమానా విధించిందని, మూడు నెలల్లో బాధితులకు నష్టపరిహారం, ఆరు నెలల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించిందని తెలిపారు. ఎన్జీటి ఆదేశాలను సిపిఎం, సిఐటియు స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితులు నేటికీ తీవ్ర అనారోగ్యంతో బాధిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కుమ్మక్కై, వాస్తవాలను మరుగున పరిచి తూతూ మంత్రంగా కమిటీలు వేసి విచారణ జరిపి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. కమిటీ నివేదిక నేటికీ బహిర్గతం చేయలేదన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే రిపోర్టు బయటికి రాకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రమాదాలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని, భద్రత ఆడిట్ నిర్వహించాలని, భద్రత ప్రమాణాలు పాటించని బ్రాండిక్స్ కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో గంటా శ్రీరామ్


మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యశోద

వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (బెల్లం మార్కెట్) అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద రవి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో శుక్రవారం 9వ సాధారణ సమావేశం యశోదరవి అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, అధిక ఉత్పత్తి గల చెరుకు రకాలపై రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సభ్యులతో చర్చించారు. ఈనెల 22న పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదిన పురస్కరించుకొని అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, ఉపాధ్యక్షులు కరక సోమ నాయుడు, డైరెక్టర్లు మరిపల్లి శోభ, నీటిపల్లి లక్ష్మీ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసి, లక్ష్మీ, బొడ్డు అచ్చిరాజు, పిట్ల అప్పలరాజు, తెరపల్లి నాగ సంతోష్ కుమార్, దాడి కుమార్, రాధాకష్ణ, ఒమ్మి మోది నాయుడు, విజయ కుమారి, గుండా రమేష్ గుప్తా, గొంతిన శివ సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికాలో ప్రవాస భారతీయుడు రామభద్రరావు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం
మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కర్రి రామభద్రరావు అనారోగ్యంతో అమెరికాలో మృతి చెందారు. దీతో తిమ్మరాజుపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రామభద్రరావు కుటుంబ సభ్యులను పలువురు పరామర్శిస్తున్నారు. రామభద్ర రావు గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రామభద్రరావు తిమ్మరాజుపేట ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, ఎలిమెంటరీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, వృద్ధులకు చీరలు, దుప్పట్లో పంపిణీ, గ్రంథాలయం ఏర్పాటు, గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సహాయం తదితర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.


రామభద్రరావు (ఫైల్‌ఫోటో)

శ్రీరామ్ నగర్ కాలనీలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని లంకెలపాలెం శ్రీరాంనగర్ కాలనీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 79వ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రౌతు వరహా నరసింహమూర్తి, దామురోతు అర్జున్, డి.అచ్చురాజు, అనపర్తి రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు

టిడిపి నుంచి 50 మంది వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలోని పిల్లవారి తోట ప్రాంతానికి చెందిన 50 మంది టిడిపి కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపిలో చేరిన మువ్వల రమణ, పి.లక్ష్మి, ఎర్రబాల సత్య, సైపురెడ్డి వరలక్ష్మి, అమ్మేటి చంద్రావతి, కొమ్మాజి రామలక్ష్మి, కొమ్మాజి భారతి, అప్పికొండ అంబికా, పప్పికొండ రాజా, చుక్క నాగమణి, అప్పికొండ పద్మావతి, పప్పికొండ రమణమ్మ, వెంకట సూర్యనారాయణ, చిక్కాల కుమారి, కర్రి జ్యోతి, పప్పు దేవి తదితరులకు ఎమ్మెల్యే వైసిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, ఒరుగంటి నెహ్రూ, సర్పంచ్ శ్రీను, పందిరి శ్రీను, మామిడి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


వైసిపి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

సమస్యలపై హైటెక్ కంపెనీ కార్మికుల ధర్నా


హైటెక్ కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-రాంబిల్లి
ఎస్ఈజెడ్‌లోని హైటెక్ కంపెనీలో కార్మికులకు జీతాలు పెంచాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.సోమునాయుడు మాట్లాడుతూ హైటెక్ కంపెనీలో కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని, కార్మికులను కట్టు బానిసలుగా చూస్తూ వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు. అదే సందర్భంలో కనీస వేతనాలు అమలు చేయడం లేదని, బోనస్‌లు, ఈఎస్ఐ, పిఎఫ్, క్యాంటీన్ తదితర సమస్యలను పరిష్కరించే వరకు ధర్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం పరిశ్రమ హెచ్ఆర్ ఇన్‌ఛార్జికి 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రాంబిల్లి ఎస్ఐ ఆధ్వర్యాన పూడి సర్పంచ్ లాలం వాణి వాసు, ఉప సర్పంచ్ ఎస్.తాతారావు, సిఐటియు జిల్లా నాయకులు కె.సోమునాయుడు, సిహెచ్.తాతయ్య, స్థానిక నాయకులు ఆర్.సంజీవ్, ఎల్.సురేష్, ఆర్.రాజు, ఎస్.రాజు హెచ్ఆర్ ఇన్‌ఛార్జితో చర్చలు జరిపారు. ఈ డిమాండ్లపై యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని, ఈ నెల 27వ తేదీ వరకు సమయం కావాలని హెచ్ఆర్ ఇన్‌ఛార్జి కోరారు. దీంతో కార్మికులను ధర్నాను విరమించి విధులకు హాజరయ్యారు.

శతశాతం ఇ-క్రాప్ నమోదు చేయాలి

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి


ప్రజాశక్తి-అనకాపల్లి
ఫిబ్రవరి 15వ తేదీ నాటికి శతశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల సాగు విస్తరణకు కావలసిన చర్యలు చేపట్టాలని సూచించారు. పాడిపశువులకు పశు బీమా చేయించాలని కోరారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు, పశు వైద్యశాలల్లో ఔషధ నిర్వహణ, వ్యవసాయ పంటలపై నుంచి వెళ్లే విద్యుత్ తీగల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, జీడిమామిడిలో సస్యరక్షణకు చేపట్టాల్సిన చర్యల గురించి సమీక్షించారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలలో కూడా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వానికి సూచించాలన్నారు. రైస్ మిల్లర్స్ పూర్తి మద్దతు ధర చెల్లించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అరటి, మామిడి తోటల పెంపకంపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, ఎల్‌డిఎం సత్యనారాయణ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న వారినే అంగన్‌వాడీ కార్యకర్తగా నియమించాలి

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని ఈదులపాక బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెం గ్రామంలో అంగన్వాడీ కార్యకర్త ఉద్యోగానికి రాజకీయ ఒత్తిడి లోబడి కాకుండా నిబంధనలు ప్రకారం అర్హత ఉన్న వారిని నియమించాలని ఆ గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇక్కడి అంగన్వాడీ కార్యకర్త కొంత కాలం క్రితం రాజీనామా చేయడంతో, ఈ ఖాళీ భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముద్దు త్రిపుర, ఝాన్సీరాణి, పూర్ణ, నాగేశ్వరి, లావణ్య, సరోజిని, భవాని, రాశి, రమణజీ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో అర్హత ఉన్న వారిని నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలని కోరారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయం వెనుకనున్న మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి సాంఘిక నాటకం ప్రదర్శించారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

మూలపేటలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 40 మంది పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షులు ఆడారి కాశీరావు, వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ఎల్లపు హైమావతి, గ్రామ పెద్దలు కాంగ్రెస్ ఈశ్వర అప్పారావు, జెకె బ్రదర్స్, భీశెట్టి మధు, మొల్లేటి నూకరాజు, కాంగ్రెస్ నాగేశ్వరరావు, ఆడారి మోహన్‌రావు, భీశెట్టి పైడికొండ, బొడ్డేడ ఆది కుమార్, మొల్లేటి సంజీవరావు, గొంప నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గున్నయ్యనాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ఎంపిపి కలగా లక్ష్మి కార్యాలయంలో శుక్రవారం ఆమె భర్త, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వచ్చి గున్నయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఆయన కేక్ కట్ చేసి కార్యకర్తలు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, వైస్ ఎంపిపి నమ్మి మీనా, వియ్యపు బూలోకనాయుడు, బలిజ మునలి నాయుడు, శ్యామ్ సన్ తదితరులు పాల్గొన్నారు.


గున్నయ్యనాయుడుకు కేక్ తినిపిస్తున్న వైసిపి నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఎన్ఎఒబి నిర్వాసిత జెఎసి పెద్దలు హెచ్చరించారు. మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ మెయిన్ గేటు ముందు 8 గ్రామాల నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 82వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి పెద్దలు మాట్లాడుతూ శారద, వరాహ నదులలో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించే వాళ్లమని, ఇప్పుడు నేవీ గేట్లు మూసి వేయడంతో తమ ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

విద్యుదాఘాతానికి బ్రిక్స్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి -చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామం వద్ద పాలజీ బ్రిక్స్‌లో పని చేస్తున్న మాడుగుల మండలం వీరనారాయణ గ్రామానికి చెందిన పేల ఆదిబాబు (43) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆదిబాబు బ్రిక్స్ తయారీ యూనిట్ వద్ద కొన్ని నెలలుగా పనిచేస్తున్నాడు. ఇటుకలు తయారు చేసే మిషన్‌కు ఉన్న మోటారుకు వచ్చే విద్యుత్ వలన షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిబాబుకు భార్య, ఇద్దరు కుమారుడుల ఉన్నారు. కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- చోడవరం : మండలంలో లక్ష్మీపురం గ్రామం గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్ల దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి 2గంటల సమయంలో చోటుచేసుకోగా, ఆ సమయంలో అగ్ని మాపక శకటం రావడం ఆలస్యం కావడంతో కోరుకొండ కృష్ణవేణి, కాశీ సోమరాజు ఇళ్ల పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఇళ్లలో ఉన్న రూ.40వేలు నగదు, తులమున్నర బంగారు పుస్తులు తాడు, 20 తులాల వెండి, కొన్ని విలువైన పేపర్లు అగ్నికి ఆహుతయ్యాయి.

ఆ మూడు బిజెపి తోక పార్టీలే..

ప్రజాశక్తి-చోడవరం : టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు బిజెపి తోక పార్టీలేనని కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వర్కింగ్ ప్రెసిడెంట్ పోచరెడ్డి రాకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 70 సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన జాతీయ సంపదను నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. రూ.3 లక్షల కోట్లు ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగించడానికి మోడీ ప్రభుత్వం చూస్తుందని, దీనికి టిడిపి, జనసేన, వైసిపి వంత పాడుతున్నాయని ఆరోపించారు. ఈ వినాసకర విధానాలను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ 26వ తేదీ నుండి మార్చి 26వ తేదీ వరకు ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గొప్ప గోవిందు, బొడ్డు శ్రీనివాసరావు, గూనూరు వెంకట్రావు, సయ్యపరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి -కె.కోటపాడు : అపరాల పంట సాగులో తీసుకోవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ ఆఫీసర్ విజేత, తులసీమణి, వారాడ క్లస్టర్ ఇన్‌ఛార్జి చిరంజీవి శుక్రవారం అవగాహన కల్పించారు. శుక్రవారం వారాడ గ్రామంలో క్లస్టర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరాల సాగులో బంగారు తీగ అనే కలుపు మొక్కలు ఉధృతంగా ఉంటున్నాయని, వాటి నివారణకు దగ్గా సూపర్ అనే మందు 250 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, లెక్కల గోపి, సత్యనారాయణ, నారాయణమూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజిత, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయితీ సచివాలయం-1 పరిధిలోని ఆదివారం సంత ఆవరణలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శుక్రవారం స్థానిక సర్పంచ్ దేడ్డము ప్రసాదరావు భూమిపూజ నిర్వహించారు. నాలుగు లక్షల రూపాయలతో దీనిని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హిమబిందు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పల్లా తాతారావు, టి.శేఖర్, చిత్రాడ శ్రీను, వైసీపీ మండల అధ్యక్షులు కర్రి బాబు, వై. రాము పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ప్రసాద రావు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ రవి, చిత్రంలో ఎస్‌పి గౌతమిశాలి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన అవసరమని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని రింగ్ రోడ్డు నుంచి నెహ్రూ చౌక జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ గౌతమి శాలితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది కంటే రోడ్డు ప్రమాదాలను 40 శాతం తగ్గించే క్రమంలో పోలీస్, రవాణా, ఇంజనీరింగ్, వైద్య శాఖలు సమన్వయంతో పని చేసినట్లు తెలిపారు. ఎస్పీ గౌతమి శాలి మాట్లాడుతూ ప్రజలకు రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.వీర్రాజు మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, రాజన్న, మురళీకృష్ణ, శివరాం, గోపాల్, వెంకటరావు, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీను, మోహన్ రావు, పోలీస్, రవాణా, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : రహదారి భద్రతపై మండలంలోని నరసింగబిల్లి జాతీయ రహదారిపై డ్వాక్రా మహిళలు, స్కూల్ పిల్లలు శుక్రవారం ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఎపిఓ ఎం.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మేరీ జోన్స్, హెచ్ఎం శాంతి కుమారి, వెలుగు సీసీ శ్రీను, విఓఎలు జోగిరత్నం, ఆదిలక్ష్మి, పి లక్ష్మీ నాగేష్, నాగమణి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

దాడులు, దౌర్జన్యాలకు దిగడం సరికాదు

-మా కుటుంబాలకు రక్షణ కల్పించండి

-కలిగొట్ల పైడితల్లమ్మ ఆలయ ధర్మకర్త పాలవెల్లి



మాట్లాడుతున్న పైడితల్లమ్మ ఆలయ ధర్మకర్త పాలవెల్లి తదితరులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని కలిగొట్ల గ్రామంలో సంప్రదాయానికి విరుద్ధంగా గ్రామ సర్పంచ్ భర్త పార్థసారథి వర్గీయులు తమ కుటుంబ సభ్యులపై దాడులు, దౌర్జన్యాలకు దిగడం సరికాదని గ్రామదేవత పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం ధర్మకర్త బొడ్డు పాలవెల్లి, బొడ్డు జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం వారు కలిగొట్లలో విలేకర్లతో మాట్లాడుతూ పూర్వం నుంచి పైడితల్లమ్మ అమ్మవారి పండగ రాజకీయాలకు అతీతంగా, సంప్రదాయ బద్ధంగా జరిగేదని తెలిపారు. ప్రస్తుతం గ్రామ సర్పంచ్ సుధారాణి భర్త పార్థసారధి, ఆయన అనుచరులు రాజకీయ పలుకుబడితో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమే అనేకసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అమ్మవారి తీర్థానికి పది రోజులు ముందుగా ఆలయ హుండీ లెక్కింపునకు సిద్ధపడగా పార్థసారథి వర్గీయులు ఆలయంలో తమను బంధించి, భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయం హుండీ నుంచి తీసిన సుమారు రెండున్నర లక్షల రూపాయలు పోలీసులు తమ ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. అధికార పార్టీ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతూ తమ ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని వాపోయారు. గతంలో ఇదే విషయంపై హైకోర్టును ఆశ్రయించగా అమ్మవారి ఆలయం తలుపులు తెరిచి ధూప దీప నైవేద్యాలు చేపట్టవచ్చని స్టే ఇచ్చినట్లు చెప్పారు. ఆ ఆదేశాలను ఇటు సర్పంచ్ భర్త వర్గీయులు, అటు పోలీసులు బేఖాతారు చేస్తున్నారన్నారు. గురువారం రాత్రి జరిగిన అమ్మవారి తీర్థం సందర్భంగా తమపై దౌర్జన్యాలు చేయడానికి సిద్ధపడుతున్నారన్నారు. తమ కుటుంబాలకు, అమ్మవారి ఆలయానికి రక్షణ కల్పించాలని వారు కోరారు.

ఉక్కు ప్రైవేటీకరణ చేయొద్దని సంతకాల సేకరణ



నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని కోరుతూ ప్రజా సంఘాలు, కెవిపిఎస్, స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం మరిడిమాంబ అమ్మవారి తీర్థంలో సంతకాల సేకరణ చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేవాడు ఎవడు, కొనేవాడు ఎవడు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నాటి కేంద్ర ప్రభుత్వం రూ.6వేల కోట్లు ఇవ్వగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్టీల్‌ప్లాంట్ రూ.59 కోట్లు డివిడెంట్ రూపంలో చెల్లిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కావలసిన ఇనుప గనులు ఇవ్వకుండా, నష్టాలు తీసుకొచ్చి అమ్మేయాలని చూస్తుందని విమర్శించారు. కేంద్ర మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని తదితర కార్పొరేట్ సంస్థలకు దేశ ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టే కుట్ర చేస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మూల పరిశ్రమ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా అందరం కలిసికట్టుగా ఉద్యమించి కాపాడుకోవాల్సిన అవసరం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గాడి ప్రసాదు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆర్.వెంకట్రావు, రెడ్డి శ్రీనివాస్, పి.వి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివిఎంసి అధికారులు

ప్లాస్టిక్ వాడొద్దు

ప్రజాశక్తి - పరవాడ : ప్లాస్టిక్ నిషేధించిన నేపథ్యంలో ఎవరూ ప్లాస్టిక్‌ను వాడొద్దని జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 79వ వార్డు దేశపాత్రునిపాలెం పరిధి శ్రీసాయి నగర్ కాలనీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరుచేసి జివిఎంసి వాహనాలకు ఇవ్వడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా నార సంచులు, స్టీల్ బాక్సులు ఉపయోగించాలని సూచించారు. దేశపాత్రునిపాలెం మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గాజువాక జానల్ కమిషనర్ సింహాచలం, ఎఎంహెచ్ఓ కిరణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేష్ సచివాలయ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

'వాలంటీరు వ్యవస్థ దేశానికి ఆదర్శం'

ప్రజాశక్తి-దేవరాపల్లి : వాలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాలంటీరు వ్యవస్థ అంటే పచ్చ గ్యాంగు ఎందుకు తట్టుకోలేకపోతుందని మండిపడ్డారు. వాలంటీర్లు ప్రజల పట్ల బాధ్యతతో, విశ్వాసం నమ్మకంతో పనిచేస్తున్నారని చెప్పారు. పచ్చ మీడియా ఈ వ్యవస్థను వక్రకోణంలో చూస్తుందన్నారు. కరోనా కాలంలోనూ, అత్యవసర పరిస్థితుల్లోనూ కూడా ఈ వ్యవస్థ సేవలు అమోఘమన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల మాదిరిగానే వాలంటీరు వ్యవస్థ కూడా ఉంటుందని వారంతా భావించినట్లు ఉన్నారని, దానికి భిన్నంగా ఈ వ్యవస్థ పని చేస్తుండడంతో తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అమోఘం

అచ్యుతాపురం : గ్రామాల్లో సేవలందిస్తున్న వాలంటీర్లు పనితీరు అమోఘమని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ వచ్చిన తరువాత మారుమూలకు గ్రామాల్లో ఉన్న ప్రజల వివరాలు నిమిషాల్లో రాష్ట్ర రాజధానికి చేరుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు పంపిణీ చురుగ్గా సాగుతుందన్నారు. వాలంటీర్ల సేవలపై కొంత మంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ట్రైనీ కలెక్టర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ట్రైనీ కలెక్టర్ ధాత్రి రెడ్డి శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని చిన్న మదీన, బుచ్చియ్యపేట గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. చిన్న మదీనలో బెల్లం తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో సువర్ణరాజు, తహశీల్దార్ అంబేద్కర్ ఉన్నారు.

తెలుగు యువత రక్తదానం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చోడవరం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మండలంలోని దిబిడి గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకులు రక్తదానం చేశారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు సేనాపతి మణికంఠ, పెదిరెడ్డ మాణిక్యం, వియ్యపు రాము, జర్ర చిరంజీవి, మంత్రి మహేష్, బంటు సాయి, డి గణేష్ తదితరులు రక్తదానం చేశారు. వీరిని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు అభినందించారు.



రక్తదానం చేస్తున్న తెలుగు యువత నాయకులు

దళిత సంఘాల నిరసన



నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో అబీద్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్, దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేసి హైదరాబాదులో నిరాహార దీక్షలు చేసి ఎస్సీ ఎస్టి సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించడం జరిగిందని తెలిపారు.ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా అసెంబ్లీలో చర్చించి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. ఈ చట్టం 10 సంవత్సరాల కాల పరిమితి ఈ నెలలో పూర్తవుతోందని, కొనసాగించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఈ మూడున్నర ఏళ్లలో దళితులకు ఖర్చు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, దళిత సంఘం జేఏసీ నాయకులు చిట్ల చలపతిరావు, రెల్లి హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు పాపారావు, మల్లేశ్వరరావు, వీరబాబు, గుడాల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మాకవరపాలెం మండలం జి.నగరంలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద దళిత సంఘం నాయకులు నిరసన చేపట్టారు. జి.నగరం గ్రామంలో దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకుండా దళితులలో కొంత మందిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. తక్షణమే దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలన్నారు. దళితులకు న్యాయం జరిగేంత వరకు నర్సీపట్నం డివిజన్ దళితసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డికెఎస్ఎస్ జిల్లా ప్రెసిడెంట్ చలపతిరావు, ఎఐఎం డివిజన్ అధ్యక్షులు సాల్మాన్ రాజు, కెవిపిఎస్ నేత ఈరెల్లి చిరంజీవి, రెల్లి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రం శెట్టి పాపారావు, మున్సిపాలిటి యూత్ నాయకులు అల్లంపల్లి ఈశ్వరరావు, దళిత ప్రగతి సంఘం నేతలు కొండ్రు మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన నేతలు



సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

త్వరితగతిన గృహాల నిర్మాణాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తహసిల్దార్ సుబ్రమణ్యంశాస్త్రి, ఎంపీడీవో సీతారామ రాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా జగనన్న లేఅవుట్ లలో ఇళ్ల నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా కృషి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు .ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. స్థానిక బ్యాంక్ కాలనీ వద్ద ఈనెల 23, 24, 27 తేదీలలో చేపట్టే దీక్షలు, నిరసనలు, కార్మిక మహాగర్జన గోడపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, 32 మంది బలిదానాలతో 26వేల మంది రైతుల త్యాగాలతో ఉక్కు పరిశ్రమ ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కంపెనీలైన పాస్కో, అదాని, అంబానీలకు లాభాలు చేకూర్చడమే బిజెపి లక్ష్యమన్నారు. బిజెపి ప్రభుత్వంపై రణభేరి మోగించడానికి ఈనెల 23, 24 తేదీల్లో అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో సిపిఐ, ఏఐటియుసీ, ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసీ జిల్లా కార్యదర్శి ఎల్.వి. రమణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా రైతు సంఘం నాయకులు జి.గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

కొరుప్రోలు సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-ఎస్‌రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామ సర్పంచ్ పోలవరపు లోవలక్ష్మి హఠాన్మరణం చెందారు. శుక్రవారం తెల్లవారు ఝామున విశాఖలో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భర్త లోవరాజు తెలిపారు. గడచిన పది రోజులుగా అనారోగ్యం పాలవడంతో విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.విషయం తెలుసుకున్న గ్రామంలో వర్తకులు షాపులను స్వచ్ఛందంగా మూసివేశారు. సర్పంచ్ మృతి పట్ల పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కొరుప్రోలు పిఏసిఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్ర రాజు, ఉపసర్పంచ్ కొరపాటి గోపాలం నాయకులు కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.



లోవలక్ష్మి (ఫైల్)

అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో అంగన్వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డిఓ జయరాం, పిడి ఉషారాణి, అనకాపల్లి డిఎంఎండిహెచ్ జ్యోతి అధ్యక్షతన అంగన్వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో ఐదు సెక్టార్లకు సంబంధించి మాడుగుల, రావికమతం, కోటవురట్ల, నర్సీపట్నం, నక్కపల్లికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మేరీ సువార్తమ్మ, సిడిపివోలు సుజాత, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఈ ఇంటర్వ్యూలకు భారీ ఎత్తున మహిళలు తరలివచ్చారు. నిరుద్యోగ మహిళలు ఎంతో ఆశతో ఇంటర్వ్యూలకు హాజరు కాగా బహిరంగంగా కొంత మంది మహిళలు అధికార పార్టీకి చెందిన నాయకుల సిఫార్సు లెటర్లతో ఇంటర్వ్యూలకు హాజరు అయ్యారని తెలిసింది.



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు



పరీక్షిస్తున్న వైద్యులు

అంకంపేటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని శ్రీరాం పురం పిహెచ్‌సి పరిధి పాల్తేరు 2 గ్రామ సచివాలయం అంకంపేట గ్రామం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు తులసీ నవీన, 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బత్తుల రత్న శేఖర్‌లు దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను పరీక్షించారు. మందులు పంపిణీ చేసినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ గ్లోరి తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ సెక్రెటరీ సిహెచ్.ఉమామహేశ్వరి, అంగ న్వాడి టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వడ్డిస్తున్న దాతలు

ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక వ్యాపారవేత్త, శ్రీరామ ఐరన్ షాప్ యజమాని పద్మనాభుని చిన్న కన్నయ్య శెట్టి చినబాబు పుట్టినరోజు సందర్భంగా స్థానిక వాసవి అమ్మవారి గుడిలో అనాథలకు, పేదలకు, వికలాంగులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాహుల్ గాంధీ .జోడో యాత్ర ముగింపును పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి మార్చి 26 వరకు పిసిసి అధ్యక్షులు రుద్రరాజు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆయా రాష్ట్రాల్లో పర్యటించి అనేక వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు తెలియజేశారని తెలిపారు.మోడీకి తొత్తులుగా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి కావాలన్నా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి అంశాలు సాధించడం కోసం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పార్టీ కన్వీనర్ మీసాల సుబ్బన్న, నాయకులు నంగిన వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీడికాడ:రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయంగా పని చేస్తామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు తెలిపారు. తన స్వగృహం వద్ద నియోజకవర్గంలోని పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పోసారెడ్డి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ,నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ నగర కాంగ్రెస్ అధ్యక్షులు గోవిందరాజు పాల్గొన్నారు



చీడికాడలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు



దుస్తులు ఇస్తున్న సర్పంచ్

దుస్తులు, నగదు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ:పాతకృష్ణదేవిపేట గ్రామానికి చెందిన పారిశుద్య కార్మికులకు సర్పంచ్ పందిరి సత్యనారాయణ శుక్రవారం బట్టలు, రూ.1500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి మాట్లాడుతూ పారిశుద్య కార్మికులు ఎంతగానో శ్రమించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. గ్రామంలో ప్రజలందరూ తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా పారిశుద్య కార్మికులకు అందజేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపి డాక్టర్ పందిరి బుజ్జి, స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎమ్ఎస్ కాలేజీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ పురుషుల జట్టు కాంస్య పతకాన్ని సాధించించింది. ఈ జట్టులో స్థానిక ఎంఎల్ఎమ్ఎస్ డిగ్రీ కళాశాలలో బిఎస్సీలో ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న పడాల సాంబశివరావు అత్యుత్తమ ప్రతిభను చాటడంతో ఉత్తమ ఆటగాడు అవార్డు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సాంబశివరావును కళాశాల ఛైర్మన్ మీసాల సుబ్బన్న, కరస్పాండెంట్ మీసాల. లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ పి. తాతబ్బాయిలు అభినందించారు.



కప్‌ను ఇస్తున్న సుబ్బన్న


విజయ్ తల్లికి నోటీస్ ఇస్తున్న అధికారులు

చింతకాయల విజయ్‌కు నోటీసులు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఈనెల 27న మంగళగిరి సిఐడి ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని 41ఎ నోటీసును శుక్రవారం ఏపీ సిఐడి పోలీస్ అధికారులు నర్సీపట్నంలో చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద అందజేశారు. విజయ్ ఇంట్లో లేకపోవడంతో ఆమె తల్లి చింతకాయల పద్మావతికి నోటీస్ ఇచ్చి సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐడి పోలీసులు మాట్లాడుతూ, గతంలో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినందుకు కేసు నెంబర్ 14/2022 సంబంధించి తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ చింతకాయల విజయ్‌కు 41ఎ నోటీసు హైదరాబాదులోని ఆయన ఇంటి దగ్గర ఇవ్వడం జరిగిందని, విచారణకు హాజరు కాలేదన్నారు. మరొకసారి ఈ కేసుపై 41ఎ నోటీసు అందజేశామన్నారు. విజయ్ అందుబాటులో లేక పోవడంతో తల్లి పద్మావతికి నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు.


నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: వేధింపులకు పాల్పడుతున్న మండలంలోని పెనుగొల్లు ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి బిఎల్ రామ్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు ధర్నా చేపట్టారు. పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశాల పట్ల వైద్యాధికారి దురుసుగా ప్రవర్తించడంతో పాటు, పని చేస్తున్న వారికి మెమోలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ నలుగురిలో అవహేళనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డరోడ్డులో తన సొంతం క్లినిక్‌కు పేషెంట్లను తీసుకు రమ్మంటున్నారని తెలిపారు. ఆయనను ఇక్కడి నుండి బదిలీ చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రావణి

తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి -రోలుగుంట: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏసిబి అధికారులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఎసిబి అడిషనల్ ఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 12.30 గంటలకు తనిఖీలకు వచ్చి సాయంత్రం వరకు కొనసాగించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల మేరకు వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. లంచం అడిగిన వారికి తీసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు, 25 మంది సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. స్థాయీ సంఘం అజెండాలలో 13 అంశాలు, అనుబంధ అజెండాలలో 21 అంశాలు పొందుపరచగా.. అవన్నీ ఆమోదం పొందాయని చైర్‌పర్సన్ తెలిపారు. జివిఎంసిలోని వివిధ జోన్లలో అభివృద్ధి పనులకు రూ.288.76 లక్షలు ఖర్చు చేసేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని, వాటిలో ముఖ్యంగా 3, 4, 6 జోన్లలో రహదారులు, కల్వర్టులు, కమ్యూనిటీ హాళ్ళు, బిటి రోడ్లు, స్మార్ట్ వాటర్ డ్రైన్స్ నిర్మాణం, నీటి శుద్ధి ఫిల్టర్ బ్లేడ్ మరమ్మతులు, నీటి శుద్ధి భవనం మరమ్మతు పనులు ఉన్నాయన్నారు. విలీన గ్రామాలలోని 14 మంది పారిశుధ్య సిబ్బందికి రూ.31 లక్షలా 73 వేలా 664ను


సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్

జీతాలు కింద చెల్లించేందుకు అనుమతిచ్చామన్నారు. అలాగే టేబుల్ అజెండాలోని అంశాలలో జి-20 సదస్సు కోసం అత్యవసర పనులు చేపట్టాల్సిన అవసరమున్నందున రూ.702.19 లక్షల పనులకు ఆమోదం తెలిపామన్నారు.

జివిఎంసిని సందర్శించిన డోన్ మున్సిపల్ కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డోన్ మున్సిపాలిటీ చైర్మన్ ఎస్.రాజేష్ నేతృత్వంలోని 34 మంది కౌన్సిలర్లు జివిఎంసిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరు సతీష్, ఉన్నతాధికారులు వారికి స్వాగతం పలికారు. జివిఎంసిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్.వర్మ, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కౌన్సిలర్లకు జివిఎంసి తరపున నగర మేయర్ జ్ఞాపికలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జివిఎంసి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయని, ఈ తరహా అభివృద్ధిని డోన్ మున్సిపాలిటీలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: స్థానిక సాయిబాబా మందిరంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మూడు సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. నూతన ప్రెసిడెంట్‌గా కర్రి రాంగోపాల్(సినీనిర్మాత), వైస్ ప్రెసిడెంట్‌గా పోతల సత్యనారాయణ, సెక్రటరీగా వేగేశిన రామచంద్ర రాజు, జాయింట్ సెక్రటరీగా నంబూరి సత్యనారాయణ, ట్రెజరర్‌గా లంక ఈశ్వరరావులు నియమితులయ్యారు. పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఈ సమావేశంలో ఆలయంలో అభివృద్ధి పనులు గురించి, భీష్మ ఏకాదశి రోజు నిర్వహించబోయే లక్ష దీపోత్సవం ఏర్పాట్లు తదితర అంశాల గురించి చర్చించారు.

వెట్టిచాకిరీ చేస్తున్నా వేతనాలివ్వరా..?

చంద్రంపాలెం పాఠశాల శానిటరీ సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి -పిఎం పాలెం: తమకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదని, పండుగ రోజున కూడా పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని చంద్రంపాలెం ఉన్నతపాఠశాల శానిటరీ వర్కర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపాఠశాలకు అనునిత్యం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, నేతలు వస్తున్నారని, అయితే ఏ ఒక్కరూ తమ గోడును పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యే డిఇఒలకు తమ వేతన సమస్య చెప్పుకుందామని వస్తే, వారిని


ఆవేదన వ్యక్తం చేస్తున్న శానిటరీ సిబ్బంది

కలవకుండా స్థానిక అధికారులు, నేతలు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగురాష్ట్రాల్లోనే అత్యధిక విద్యార్థులకు కలిగిన చంద్రంపాలెం పాఠశాలలో ప్రస్తుతం 4500మంది విద్యార్థులంటే అక్కడ శానిటేషన్ పనుల కోసం కేవలం ఐదుగురంటే ఐదుగురే సిబ్బంది ఉన్నారు. పాఠశాల పరిశుభ్రతకు వెట్టిచాకిరీ చేస్తున్నా, తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని వీరంతా వాపోతున్నారు. నెలకు అరకొరగా ఇచ్చే రూ.ఆరు వేలు వేతనాన్ని ప్రతినెలా సక్రమంగా ఇవ్వకుంటే తమ జీవనం ఎలా సాగించేదని వీరంతా ప్రశ్నిస్తున్నారు. ఇటీవల అప్పు చేసి పండుగ చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని,ఏ ఒక్కరూ తమ వేతన సమస్యను పట్టించుకోవడం లేదని అంటున్నారు.


సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సచివాలయ కన్వీనర్ల అధ్యక్షునిగా శాంతారాం

ప్రజాశక్తి -గొలుగొండ: సచివాలయ వైసిపి కన్వీనర్ల మండల అధ్యక్షుడిగా కొరుప్రోలు శాంతారాం నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అందజేశారు. ఈ సందర్భంగా శాంతారాంను పలువురు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమార్, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, గుండుపాల సర్పంచ్ జోగా రామకృష్ణ, ఎంపిటిసి కొరుప్రోలు సత్తిబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు, ఏటిగైరంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు సుర్ల రమణ, పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ, పాకలపాడు ఎంపిటిసి సనాయుడు పాల్గొన్నారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

తరగతి గదుల పరిశీలన

ప్రజాశక్తి-పాయకరావుపేట: పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ మండల చైర్మన్ చిక్కాల రామా రావు, మండల విద్యాధికారులు ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యేలు బాబూరావు, రమణమూర్తిరాజు


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి పాయకరావుపేట: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని పాయకరావుపేట శాసనసభ్యులు, ఏపీ అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకట నగరం పంచాయతీలో పర్యటించారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఎంపీపీ పార్వతీ తాతారావు, మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబురావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి లక్ష్మణరావు, బీసీ నాయకులు కేసనకుర్తి సత్తిబాబు, తహసిల్దార్ కె.జయప్రకాష్, ఈవోపీఆర్డి సిహెచ్ చంద్రశేఖరరావు, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని చిప్పాడ, ఉద్దపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు శుక్రవారం చేపట్టారు. ఆయనకు ఎంపీటీసీ సభ్యుడు రాజాన పైడి భాస్కరరావు బాషా పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ రాజాన నాయుడు బాబు, జడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న రమణమూర్తిరాజు